epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

T MEDIA

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం - సెప్టెంబర్ 07-2023, పేజీలు : 3

అఖిల భారత బ్రాహ్మణ (సర్వీస్) నెట్ వర్క్ సౌజన్యంతో..

టీ-మీడియా పెళ్లిపందిరి

ఆధ్వర్యంలో....

త్వరలో...హైదరాబాద్‌లో జాతీయస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నాము..

ప్రవేశం ఉచితం

నోట్ : రిజిస్ట్రేషన్ తదితర వివరాల కోసం (ఇంచార్జి) : 7382990365, 8919710365 కి కాల్ చేయండి.

# ప్రతిపక్షాలు 'భారత్'ని సృష్టిస్తే



### -బిజెపి దాన్ని కూడా మారుస్తుందా
### -సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

**టీ మీడియా, సెప్టెంబర్ 6,న్యూఢిల్లీ :** ప్రతిపక్షాల కూటమి పేరు 'ఇండియా'గా ఉన్నదనే.. దేశం పేరును 'భారత్'గా మోడీ ప్రభుత్వం మార్చిందని సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. సెప్టెంబర్ 9-10 తేదీల్లో ఢిల్లీలో జి-20 సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో పలువురి రాజకీయ నేతలకు రాష్ట్రపతి భవన్ 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' పేరుతో ఈ శిఖరాగ్ర సమావేశ విందుకు ఆహ్వానించింది. నేతలకు పంపిన ఆహ్వాన పత్రికల్లో 'ఇండియా'గా ఉన్న పేరు 'భారత్'గా మార్చడంపై కాంగ్రెస్ నేతలు, పలువురు రాజకీయ నేతలు మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశం పేరు మార్పు గురించి సీతారాం ఏచూరి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రతిపక్షాల కూటమి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరు నుంచే 'భారత్'ని మోడీ ప్రభుత్వం సృష్టించింది. ఇప్పుడు ప్రతిపక్షాలన్నీ 'భారత్' అనే పదాన్ని సృష్టిస్తే మోడీ ప్రభుత్వం ఏం చేస్తుంది? అని సీతారాం ఏచూరి ప్రశ్నించారు.

'రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్‌లో 'భారత్' అనే పదం భారతదేశం.. రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుంది' అని చెబుతోంది. ఇది ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్, ఇండియన్ సైన్సెస్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్.. ఐఐటీ, ఐఐఎం వీటన్నింటిలోనూ భారత్ ఉంది. ఇది ఇప్పటివరకు ప్రెసిడెంట్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండియాగానే ఉంది. దాన్ని 'భారత్'గా మార్చడం వెనుక ఉద్దేశమేంటన్నది ప్రశ్నార్థకమే. ప్రతిపక్ష పార్టీలు, లౌకిక శక్తులు 'ఇండియా' పేరుతో ఒక్కటయ్యాయి. ఈ ఐక్యతను 'ఇండియా' పేరును తట్టుకోలేకనే బిజెపి రెచ్చిపోయి 'భారత్' పేరుని సృష్టించింది.' అని సీతారాం ఏచూరి మీడియాతో అన్నారు.

### జీ20 సమావేశాలను చెడగొట్టద్దని
## -చైనాను కోరిన అమెరికా

**టీ మీడియా, సెప్టెంబర్ 6న్యూయార్క్**



ఇండియాతో ఉన్న విబేధాలను పక్కనపెట్టి, ఢిల్లీలో జరగబోయే జీ20 సమావేశాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆ సమావేశాల్లో నిర్మాణాత్మక పాత్రను పోషించాలని చైనాను అమెరికా కోరింది. ఆ దేశ జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్ ఈ అభ్యర్థన చేశారు. ఒకవేళ చైనా ఆ సమావేశాలను చెడగొట్టాలనుకుంటే అది ఆ దేశ ఉద్దేశమని జేక్ తెలిపారు. ఢిల్లీలో జరిగే జీ20 సమావేశాలకు అధ్యక్షుడు జిన్‌పింగ్ వెళ్లడం లేదని చైనా స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా ఆ కామెంట్ చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో 9, 10వ తేదీల్లో జీ20 సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు చైనా ప్రధాని లీ కియాంగ్ హాజరుకానున్నారు.

# ఏపీ రాజధానిగా విశాఖ..

### -నిర్ణయం తీసుకున్న జగన్ సర్కారు

**టీ మీడియా, సెప్టెంబర్ 6,అమరావతి**

విశాఖ రాజధానిగా త్వరలో ఏపీలో పాలన ప్రారంభం చేస్తామని చెబుతున్న జగన్ సర్కార్ ఈరోజు ఆదిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ హోదా పెంచాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దాన్ని దృష్టిలో ఉంచుకునే నగర పోలీస్ కమిషనరేట్ పరిధిని అడిషనల్ డీ జీ ర్యాంక్ కు పెంచినట్టు విశాఖ సీపీ గా అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నియమించింది.పరిపాలనా రాజధానిగా విశాఖ ను చేస్తామని తరచూ ప్రకటిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. అక్టోబర్ 2 గాంధీ జయంతి నాడు కానీ, లేదంటే అక్టోబర్ 24 వ తేదీ న దసరా సందర్భంగా కానీ ముఖ్యమంత్రి తన క్యాంప్ కార్యాలయాన్ని విశాఖ మారుస్తారన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీ వర్గాలు కూడా అవి నిజమేననట్టు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో మౌలిక సదుపాయాలు పెంచేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా ఈరోజు జరిగిన తొమ్మిది మంది ఐపీఎస్ బదిలీల్లో విశాఖ నగర పోలీస్ కమిషనర్ గా ఉన్న త్రివిక్రమ్ ను బదిలీ చేస్తూ కొత్త నగర పోలీస్ కమిషనర్ గా 1994 బ్యాచ్ కు చెందిన రవిశంకర్ అయ్యన్నార్ ని నియమించారు. 1983 నుంచి విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధి ఐజి స్థాయి అధికారి పరిరక్షణ లో ఉండేది. తాజాగా ఈరోజు ఇచ్చిన బదిలీల్లో సీనియర్ అడిషనల్ డీజీపీ ర్యాంకు కలిగి, మరికొద్ది నెలల్లో డీజీగా పదోన్నతి పొందనున్న రవిశంకర్ ఐ ఎన్ ఆర్ ని ప్రభుత్వం నియమించడం ద్వారా త్వరలోనే విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిని అదనపు డీజీ హోదాకి పెంచుతున్నట్టు సంకేతాలు ఇచ్చింది. దీనితో రాజధాని తరలించే ఉద్దేశంతో ఉన్న ప్రభుత్వం అదిశగా ఈ చర్య తీసుకుందన్న చర్చ ప్రారంభమైంది.



**1861 నుంచి విశాఖలో పోలీస్ వ్యవస్థ**

విశాఖ లో 1861 జనవరి 28 వ తేదీన వైజాగపట్టణం జిల్లా పోలీస్ వ్యవస్థ ప్రారంభమైంది. తొలుత వైజాగపట్నం కి ఎస్పీ మాత్రమే ఉండే వాళ్ళు. ఇది మద్రాస్ రాష్ట్రం లో నార్త్ రేంజ్ లో ఒక జిల్లాగా ఉండేది. ఆ తర్వాత నార్త్ రేంజ్ లోని నాలుగు జిల్లాలు వైజాగపట్నం, గంజాం ఉభయగోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, కృష్ణ గుంటూరుకు చెందిన కొన్ని ప్రాంతాలు కలిపి నార్త్ జోన్ గా, దానికి ఒక డిఐజి స్థాయి అధికారి పర్యవేక్షణలో ఉండేది. 1983 వరకు ఇలానే కొనసాగింది.

# 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..?

### వినాయక చవితి నాడే ప్రారంభం

**టీ మీడియా, సెప్టెంబర్ 6,న్యూఢిల్లీ:** ఈ నెల 18 నుంచి 22 వరకు 5 రోజుల పాటు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను కొత్త పార్లమెంట్ భవనంలో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం ఈ నెల 19న వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని కొత్త భవనంలో సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే అధికారికంగా అటు ప్రభుత్వం నుంచి, పార్లమెంట్ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను తొలి రోజు పాత భవనంలోనే నిర్వహించి, రెండో రోజు నుంచి కొత్త భవనంలో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిసింది. ఇవి ప్రత్యేక సమావేశాలు కావడంతో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్, ప్రైవేట్ మెంబర్ బిజినెస్ వంటివేవీ ఉండవని, కేవలం ప్రభుత్వ బిజినెస్ మాత్రమే ఉంటుందని అధికారులు వెల్లడించారు. అంటే కేవలం బిల్లులను ప్రవేశపెట్టడం, వాటిపై చర్చ, ఓటింగ్, పాస్ చేయడం వంటి కార్యాకలాపాల కోసమే ఈ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం తలపెట్టింది.ఎవరినీ సంప్రదించలేదు.. అజెండా ఏంటో చెప్పలేదు : ప్రధానికి రాసిన లేఖలో సోనియాగాంధీప రాజకీయ పార్టీనసంప్రదించుకుండానే పార్లమెంట్ ఉభయ సభలను ప్రత్యేకంగా సమావేశపరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాసిన ఆమె ఎవరినీ సంప్రదించకుండా సమావేశాలు ఏర్పాటుచేయడాన్ని తప్పుబట్టారు. కేవలం ప్రభుత్వ బిజినెస్ మాత్రమే ఉంటుందని తమకు సమాచారం ఇచ్చారని ఆమె అన్నారు.అయినప్పటికీ ఈ స్పెషల్ సెషన్‌లో పాల్గొంటామని సోనియా తెలిపారు. ఒకరకంగా దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించేందుకు, సభలో లేవనెత్తేందుకు ఇదొక అవకాశంగా భావిస్తామని ఆమె అన్నారు. తాము లేవనెత్తబోయే ప్రజా సమస్యలపై చర్చించడానికి తగిన సమయం కేటాయించాలని ప్రధాని మోదీని ఆమె కోరారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం పై చర్చించాలని అన్నారు.రైతు సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి అంశాలపై కూడా చర్చ జరగాలన్నారు. అలాగే అదానీ గ్రూపు వ్యాపారాలు, లావాదేవీలపై 'జాయింట్ పార్లమెంటరీ కమిటీ'తో విచారణ జరిపించాలని సోనియా గాంధీ డిమాండ్ చేశారు. మణిపూర్ హింస, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలని, హర్యానాలో చోటుచేసుకున్న మత హింస నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న మత విద్వేషాలపై కూడా చర్చించాలి ఆమె తన లేఖలో కోరారు.అరుణాచల్ ప్రదేశ్, లద్దాక్ ప్రాంతాల్లో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించి, తన ఆధీనంలో పెట్టుకుందని, ఈ అంశంపై కూడా పార్లమెంటులో చర్చించాలని అన్నారు. అత్యవసరంగా కుల గణన చేపట్టాలని సోనియా ప్రధాన మంత్రిని డిమాండ్ చేశారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు దెబ్బతినడం వంటి అంశాలతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా దారుణంగా దెబ్బతిన్న రాష్ట్రాల గురించి, కొన్ని రాష్ట్రాల్లో నెలకొన్న కరవు పరిస్థితుల గురించి చర్చించాలని సోనియా గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.



### పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల
# అజెండా వెల్లడించండి

### - ప్రధాని మోదీకి సోనియా గాంధీ లేఖ

**టీ మీడియా, సెప్టెంబర్ 6, న్యూఢిల్లీ :**

సెప్టెంబర్ 18 నుంచి 22 వరకూ నిర్వహించే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండా వివరాలను కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ బుధవారం లేఖ రాశారు. 9 కీలక అంశాలపై చర్చకు సమయం కేటాయించాలని కూడా ఆమె ప్రధానిని కోరారు. ఇతర రాజకీయ పార్టీలను సంప్రదించకుండానే సెప్టెంబర్ 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఈ లేఖలో సోనియా గాంధీ ప్రస్తావించారు. అసలు ఈ సమావేశాల అజెండా ఏంటో తమకెవరికీ తెలియదని ఆమె పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల అజెండాను ప్రభుత్వం వెల్లడించాలని, ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మహిళా రిజర్వేషన్ల బిల్లును సత్వరమే ఆమోదించాలని కూడా విపక్షాలు పట్టుబట్టాయి. పార్లమెంట్ సమావేశాల్లో అదానీ అంశాన్ని కూడా ప్రస్తావించాలని విపక్ష పార్టీలు నిర్ణయించాయి. భోపాల్‌లో తదుపరి భేటీ సందర్భంగా మధ్యప్రదేశ్‌లో ఇండియా కూటమి పార్టీల తొలి ర్యాలీని నిర్వహించాలని కూడా నిర్ణయం తీసుకున్నాయి.




కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన డిన్నర్ భేటీలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష పార్టీలు చర్చించాయి. అజెండా వెల్లడించకుండా మోదీ సర్కార్ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించడం సరైంది కాదని భేటీ అనంతరం ఖర్గే పేర్కొన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్, చైనా దురాక్రమణ, కాగ్ నివేదికలు, స్కామ్‌లు, వ్యవస్థల నిర్వీర్యం వంటి కీలక అంశాలపై చర్చను పక్కదారి పట్టించేలా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

### ఒకటి రెండు రోజుల్లో
# నన్ను కూడా అరెస్ట్ చేస్తారు

**చంద్రబాబు నాయుడు**

**టీ మీడియా, సెప్టెంబర్ 6హైదరాబాద్:**

రాయదుర్గం పల్లె ప్రగతి కోసం ప్రజావేదికలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆరాచక పాలన దించడానికి ఇంటికి ఒకరు ముందుకు రావాలి అన్నారు.' ఒకటి రెండు రోజుల్లో నన్ను కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉంది. నా పైనా దాడులు చేస్తారు. నా పైనే తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రతిపక్షాలు బయటకు రాకుండా చేస్తున్నారు. ఎక్కువగా మాట్లాడితే రౌడీలతో దాడులు చేయిస్తున్నాడు. టిడిపిలో హయంలో వివేకాను హత్య చేసి.. రక్త చరిత్ర అని రాశారు. పింక్ డైమండ్ సిబిఎన్ ఇంట్లో ఉందని ప్రచారం చేశారు. పుంగనూరు , తంబాలపల్లిలో 400 మందిపై కేసులు పెట్టారు. పుంగనూరు అలర్లలో నేను చెప్పానని చల్లాబాబును సంతకం పెట్టమన్నారు. కుప్పంకు వెళ్లి నా టిక్కెట్ నేనే ప్రకటించుకోవాలా.? అని ప్రశ్నించారు. మాకు అన్యాయం జరిగిందని ఏ ఉద్యోగం సంఘం అయినా బయటకు వచ్చి పోరాడుతోందా' అని ప్రశ్నించారు.



### సనాతన ధర్మం వ్యాఖ్యలపై
# ధీటుగా స్పందించండి : మోడీ

**టీ మీడియా, సెప్టెంబర్ 6,న్యూఢిల్లీ :**

తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ 'సనాతన ధర్మం'పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై ప్రధాని మోడీ స్పందించారు. బుధవారం జరిగిన క్యాబినెట్ మంత్రుల సమావేశంలో సనాతన ధర్మం వ్యాఖ్యలపై సరైన విధంగా స్పందించాలని మోడీ ఆదేశించారు. ఈరోజు జరిగిన క్యాబినెట్ మంత్రుల సమావేశంలో ప్రధాని రెండు అంశాలపై స్పష్టతనిచ్చారు. మొదటిది సనాతన ధర్మంపై డిఎంకె నేత చేసిన వ్యాఖ్యలపై కఠినంగా స్పందించమన్నారు. ఇక రెండవది 'ఇండియా', 'భారత్' అంశంపై మాట్లాడవద్దని మంత్రులకు మోడీ సలహా ఇచ్చారు. దీనికి సంబంధించి కేవలం పార్టీ అధికార ప్రతినిధులు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తారని, మిగతావారంతా సనాతన ధర్మాన్ని కించపరచిన వ్యాఖ్యలకు ధీటుగా సమాధానమివ్వాలని కోరారు., సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకుగానూ ఉదయనిధి స్టాలిన్‌పై, ప్రియాంక ఖర్గేపై కేసు నమోదైంది. అయినప్పటికీ ఈ వ్యాఖ్యలపై వెనక్కి తగ్గేదే లేదని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు.



# విజేత కు అదనపు బాధ్యతలు

**టీ మీడియా, సెప్టెంబర్ 6 ,పాల్వంచ:** మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిగా జిల్లా ఉపాధి కల్పనాధికారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. చిన్నతనం నుండే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన విజేత మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గారి మార్గదర్శకాల మేరకు, సిబ్బంది సహకారంతో బాగా పని చేసి శాఖకు మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తానని చెప్పారు. తనపై ఎంతో నమ్మకంతో చాలా ప్రధానమైన శాఖ బాధ్యత అప్పగించారని ఈ సందర్భంగా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.



# అదానీ కంపెనీల్లోని విదేశీ ఇన్వెస్టర్ల అదృశ్యం

## మారిషస్ నుంచి ఆరు మాయం

**టీ మీడియా, సెప్టెంబర్ 6.న్యూఢిల్లీ :**
అదానీ కంపెనీల్లో డొల్ల సంస్థల పెట్టుబడులు మరోమారు నిరూపేతమయ్యాయి. అదానీ లిస్టెడ్ కంపెనీల్లో షేర్లను కొనుగోలు చేస్తూ.. కృత్రిమ ధరల పెంపునకు పాల్పడుతోన్న విదేశాల్లోని అజ్ఞాత ఇన్వెస్టర్లు అదృశ్యమయ్యారు. అదానీ సంస్థలలో షేర్లను కొనుగోలు చేస్తోన్న ఎనిమిది విదేశీ ఫండ్‌లలో ఆరు సంస్థలు మాయమయ్యాయని మింట్ ఓ కథనంలో వెల్లడించింది. ఇందులో బెర్ముడా, మారిషస్ ఫండ్ సంస్థలున్నాయి. గతేడాది మారిషస్ ఆధారిత రెండు సంస్థలు మూత పడ్డాయి. మూడోది మూసివేసే ప్రక్రియలో ఉందని మిట్ రిపోర్ట్ చేసింది. 2020లో అదానీ గ్రూప్ కంపెనీలలో విదేశీ సంస్థల హోల్డింగ్‌లపై మార్కెట్స్ రెగ్యులేటర్ దర్యాప్తు ప్రారంభించిన తర్వాత అవి మూతపడటంతో అదానీ కంపెనీల్లో అజ్ఞాత పెట్టుబడులకు మరింత బలం చేకూరినట్లయ్యింది. ఈ పరిణామం ఈ పెట్టుబడి సంస్థల అంతిమ లబ్ధిదారులను గుర్తించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి సవాలుగా మారింది. మింట్ కథనం ప్రకారం.. మారిషస్ నుంచి అదానీ కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టిన అసెంట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ జూన్ 2019 నుంచి అదృశ్యమయ్యింది.



లింగో ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మార్చి 2015లో మూసివేయబడింది. మిడ్ ఈస్ట్ ఓషన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ గతేడాది ఆగస్టులో చిరునామా లేకుండా పోయింది. ఇఎం రిసర్జెంట్ ఫండ్ గతేడాది ఫిబ్రవరిలో మూసివేయబడింది. ఆసియా విజన్ ఫండ్ మూసివేసే ప్రక్రియలో ఉంది. అదానీ గ్రూపులో డొల్ల, దొంగ పెట్టుబడులపై ఇటీవల ఆర్గనైజ్డ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) ఓ రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అదానీ గ్రూప్‌లో రహస్యంగా పెట్టుబడి పెట్టిన ఇద్దరు వ్యక్తులు.. అదానీ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని వెల్లడించింది. గౌతం అదానీ సోదరుడు వినోద్ అదానీ సంస్థల్లో పెట్టుబడులు కలిగి ఉన్నారని పేర్కొంది. సెబీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిపింది. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పైనా సుప్రీంకోర్టు విచారిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. సుప్రీం ఆదేశాల మేరకు అదానీ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులపైనా సెబీ దర్యాప్తు జరుపుతోంది. విదేశీ పెట్టుబడులకు సంబంధించి మరింత సమాచారం దొరకాల్సి ఉందని సెబీ ఇటీవల అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లోనూ పేర్కొంది. కాగా.. అదానీ కంపెనీ షేర్లలో అజ్ఞాత పెట్టుబడులపై విచారిస్తోన్న సెబీకి అదృశ్య ఇన్వెస్టర్లను కనుగొనడం పెద్ద సవాల్‌గా మారనుంది. ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన గౌతం అదానీ ఆర్థిక అక్రమాలు, షేర్ల ధరల కృత్రిమ పెంపునపై అనేక రిపోర్టులుగా రాగా.. ఇప్పటికీ ఎక్కడా కూడా పారదర్శకంగా విచారణ జరగడం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే.

## ఉత్తమ టీచర్‌గా నేషనల్ ఐడియల్ టీచర్ అవార్డు

- అందుకున్న కె. రజిత

**టీ మీడియా, సెప్టెంబర్ 6, రామకృష్ణాపూర్ :**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ జ్యోతి నగర్ కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కారుకూరి రజితను ఉత్తమ టీచర్ గా సహారా చారిటబుల్ ట్రస్ట్ ఎంపిక చేసింది. విద్యార్థుల సర్వతోముఖాభివద్ధియే ధ్యేయంగా కషి చేస్తున్న విద్యావేత్తలు, ప్రభుత్వ ప్రైవేటు,పాఠశాలల టీచర్లు, విశ్వవిద్యాలయాల ఉపకులాధిపతులతో పాటు, ప్రజల మన్ననలను పొందిన పోలీసులు,యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మొదలైన వారికి జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డులను ఇస్తూ సత్కరించడంలో భాగంగా వేమనపల్లి మండలం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో టీచర్ గా విధులు నిర్వహిస్తున్న కారుకూరి రజితను నేషనల్ ఐడియల్ టీచర్ అవార్డు 2023 కు గాను సహారా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డా.అఖ్ లక్ అహమ్మద్ ఎంపికచేశారు.




## కోదాడ ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

**టీ మీడియా, సెప్టెంబర్ 6, కోదాడ :**
కోదాడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మునీర్, 200 యువకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే క్యాప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వారి సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరారు.పార్టీలోకి చేరిన నాయకులకు గులాబీ కండువాలను కప్పి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తమ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువకులకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుంది అని ఆయన అన్నారు. కోదాడ నియోజకవర్గ అభివద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. పార్టీలో చేరిన వారు నజీర్, వినోద్, సాయి, అంజి, నారాయణ యువ నాయకులు షేక్ మునీర్ తో పాటు 200 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చందు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు తోగారు రమేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కట్ట సతీష్, స్థానిక కౌన్సిలర్ జ్యోతి శ్రీనివాస యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తుల ఉపేందర్, పట్టణ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల వేతనాలు చెల్లించాలి

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

**టి మీడియా, సెప్టెంబర్ 6, హైదరాబాద్ :**
తెలంగాణలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ కాంట్రాక్టు ఉద్యోగులు, జూనియర్ లెక్చరర్లు కీలక భూమిక పోషించారన్నారు. ప్రత్యేక రాష్ట్రం రాగానే ఒక్క సంతకంతో అందరినీ రెగ్యులర్ చేస్తా అని ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. 2014 తెలంగాణ రాష్ట్ర సమితి మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చినట్లు చెప్పారు. ఆశించినట్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని.. అయినప్పటికీ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను మాత్రం రెగ్యులర్ చేయలేదన్నారు. క్రమబద్ధీకరణ జరగకపోగా జీతాలివ్వండని అర్థించాల్సిన పరిస్థితి వచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు."విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నా సకాలంలో జీతాలు లేక వందలాది మంది అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి జీతాలు రాక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారింది. ఈఎంఐలు సకాలంలో కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో బాధాకరం. మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అసలు ఏ రోజు జీతం పడుతుందో కూడా తెలియని దుస్థితి వచ్చింది. ఇదేనా ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటే? ధనిక రాష్ట్రమని చెప్పుకోవడమే తప్ప కాంట్రాక్టు లెక్చరర్స్‌కు వేతనాలు చెల్లించలేని దుస్థితి మీ ప్రభుత్వంలో వచ్చింది. వారికి సకాలంలో జీతాలు వచ్చేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉంది. లేనిపక్షంలో వారి పోరాటానికి కాంగ్రెస్ మద్దతుగా నిలవడమే కాక, వారి తరఫున ప్రత్యక్ష కార్యాచరణకు సైతం సిద్ధమవుతాం" అని రేవంత్ పేర్కొన్నారు.



## బైడెన్‌కి కొవిడ్ నెగటివే.. జీ20 సమ్మిట్‌లో పాల్గొంటారు

- వైట్ హౌస్

**టీ మీడియా, సెప్టెంబర్ 6, వాషింగ్టన్ :**
జీ20 సమ్మిట్ కు ముందు అమెరికా ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ కు కరోనా వైరస్ పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. అయితే, అధ్యక్షుడు జో బైడెన్ కి మాత్రం నెగటివ్ వచ్చింది. భార్యకు పాజిటివ్ రావడంతో అధ్యక్షుడు ఈనెల 9-10 తేదీల్లో ఢిల్లీలో జరగబోయే జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశాలకు హాజరవుతారో లేదో అన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీనిపై తాజాగా వైట్ హౌస్ స్పష్టతనిచ్చింది. జిల్ బైడెన్‌కు పాజిటివ్ తేలడంతో అధ్యక్షుడికి సోమవారం, మంగళవారం వరుసగా కొవిడ్ టెస్ట్ నిర్వహించగా.. రెండు సార్లూ నెగటివ్ వచ్చినట్లు వెల్లడించింది. దీంతో బైడెన్ గురువారం ఢిల్లీ బయలుదేరనున్నట్లు తెలిపింది. 'జీ20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు అధ్యక్షుడు బైడెన్ గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. శుక్రవారం ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆ తర్వాత శని, ఆదివారాల్లో జీ20 అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు' అని యూఎస్ జాతీయ భద్రతా సలహాదారు తెలిపారు. కాగా, అధ్యక్షుడు బైడెన్ భార్య జిల్ బైడెన్‌కు సోమవారం కరోనా పాజిటివ్‌గా తేలిన విషయం తెలిసిందే. 72 ఏళ్ల ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ గత కొన్ని రోజుల నుంచి స్వల్ప స్థాయిలో కొవిడ్ లక్షణాలతో ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం దిలావర్‌లోని రిహోబోత్ బీచ్‌లో ఉన్న ఇంట్లోనే ఆమె గడుపుతున్నారు. జిల్‌కు పాజిటివ్ తేలడంతో 80 ఏళ్ల అధ్యక్షుడు జో బైడెన్‌కు సోమవారం కొవిడ్ పరీక్ష చేపట్టారు. ఆ పరీక్షలో ఆయన నెగటివ్‌గా తేలినట్లు వైట్‌హౌస్ తెలిపింది. నిరంతరం ఆయనకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే మంగళవారం మరోసారి బైడెన్‌కు పరీక్షలు చేయగా.. అందులోనూ నెగటివ్ అనే వచ్చింది. దీంతో ఆయన భారత్ పర్యటనకు రాబోతున్నారు. ఢిల్లీ బయలుదేరే ముందు బైడెన్ సహా పర్యటనకు వచ్చే అధికారులందరికీ మరోసారి కొవిడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. అధ్యక్షుడు బైడెన్ భారత్ పర్యటకు రావడం ఇదే మొదటిసారి. మరోవైపు ఇటీవల అమెరికాలో మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గత కొన్ని వారాల నుంచి హాస్పిటల్స్‌లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.



## ఉషన్నపల్లిని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయండి

**టీ మీడియా, సెప్టెంబర్ 6, పెద్దపల్లి బ్యూరో :**
పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామ పంచాయితీ లో గల ఉషన్న పల్లి గ్రామ యువత, ప్రజలందరూ కలిసి స్థానిక సర్పంచి కి ప్రత్యేక గ్రామ పంచాయతీ గా ఉషన్నపల్లె ను ఏర్పాటు చేయాలని బుధవారం గంగారం సర్పంచ్ కి వినతి పత్రం ఇచ్చారు ఉషన్నపల్లి లో సుమారుగా రెండు వేల జనాభా ఉంటుందని అందులో1400 ఓటర్లు ఉన్నారు అని గ్రామపంచాయతీకి వెళ్లాలంటే దూరంగా ఉన్నటువంటి గంగారం కి వెళ్లాల్సి వస్తుంది.కావున ప్రజల కోరికను మన్నించి మా ఊరును ప్రత్యేక గ్రామపంచాయతీగా ఉషన్న పల్లెను ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే స్పందించిన సర్పంచ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులచే తీర్మాన కాపీ పైన సంతకాలు చేయించి తీర్మాన కాపీని ఇవ్వడం జరిగింది. గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వడం పట్ల గ్రామ యువత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు.సింగిల్ విండో డైరెక్టర్లు. ప్రజా ప్రతినిధులు. మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ ఆత్మహత్య

**టీ మీడియా, సెప్టెంబర్ 6, కర్నూలు :**
ఏపీలోని కర్నూలు జిల్లాలో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లాలోని ఆదోని పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సందీప్‌కుమార్ (32) బుధవారం ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐలు విక్రమ సింహ, శ్రీనివాస్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అయితే కానిస్టేబుల్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. పోలీసు పంచనామా నిర్వహించి మతదేహాన్ని ఆదోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.



## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్

- తూటి రజిత రఫీ

**టీ మీడియా, సెప్టెంబర్ 6, ముత్తారం :**
ముత్తారం మండలంలోని కాసర్లగడ్డలోని కాట్ల రాజయ్య తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ముత్తారం గ్రామ సర్పంచ్ తూటి రజిత రఫీ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనుము సమ్మయ్య, శంకర్, అమ్ము వెంకటస్వామి, జక్కుల రమేష్, మల్యాల బాలయ్య, చల్ల సదయ్య, పార్నంది శ్రీను, ఎడవేన కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.







## గ్రంథాలయ అభివృద్ధి కోసం మైహోం ఇండస్ట్రీ చేయూత

**టి మీడియా, సెప్టెంబర్ 6, మేళ్ళ చెరువు :**
మేళ్లచెరువులోని గ్రంథాలయ అభివృద్ధి కొరకు మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ప్రతినిధులు పి అండ్ ఏ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు , అడ్వైజర్ జగన్నాథరావు చేతులు మీదుగా, గ్రంధాలయ సంస్థ చైర్మన్ అవ్వారు రాజుకి 49500/- రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ఈసందర్భంగా గ్రంథాలయ కమిటీ మాట్లాడుతూ.. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్న మై హోమ్ యాజమాన్యంకి కృతజ్ఞతలు తెలపడం జరిగినది. ఇంకా ముందు ముందు రోజుల్లో గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తామని మై హోమ్ యాజమాన్యం వారు మాట ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీధర్ రెడ్డి,గ్రంథాలయ వైస్ చైర్మన్ బుస్సా సైదులు, సెక్రటరీ చౌదరి,ఓబుల్ రెడ్డి, తునికిపాటి శ్రీనివాసచారి,నాగిరెడ్డి, రవి , సంస్థ ప్రతినిధులు,ఏ జి యం శ్రీనివాస్, రత్నం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## రావుస్ పాఠశాలలో వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**టీ మీడియా, సెప్టెంబర్ 6, గోదావరిఖని :**
రావుస్ సంస్థ చైర్మన్ పొలసాని ప్రభాకర్ సౌజన్యంతో రామగుండం బ్రాంచ్ ఎన్ టి పి సి అన్నపూర్ణ కాలనీ లో రావుస్ ప్రిన్సిపల్ సాధన మేడమ్ ఆధ్వర్యంలో బుధవారం అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా మహిళ కార్యదర్శిగా ఉమారఘువీర్ నియామకం

**టీ మీడియా, సెప్టెంబర్ 6, నడిగూడెం :**
జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యదర్శిగా ఉమా రఘువీర్ ను ఎన్నిక చేసినట్లు నూతనంగా నియామకమైన ఉమారఘువీరు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మహిళ అధ్యక్షు రాలు అనురాధలు మండలం లోని రత్నవరం గ్రామానికి చెందిన ఉమరఘువీర్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా జిల్లా మహిళా కార్యదర్శిగా నియమించినట్లు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.నా పై నమ్మకం తో పార్టీ ఇచ్చిన ఈ పదవి కి న్యాయం చేస్తూ జిల్లా లో పార్టీ ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే మహిళలకు ఎలాంటి న్యాయం జరుగుతుందో వివరిస్తూ ముందుకు సాగుతానని ఆమె అన్నారు. అలాగే నా ఎన్నికకు సహకరించిన నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు వెంకన్న యాదవ్, మహిళ అధ్యక్షు రాలు అనురాధ లకు ఆమె కతజ్ఞతలు తెలిపారు.





## విద్యా వాలంటీర్ వేతనం కోసం అరవై వేలు మంజూరు

**టి మీడియా, సెప్టెంబర్ 6, మేళ్ళ చెరువు :**
మేళ్లచెరువు మండలం వేపల మాధవరం గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పని చేయు చున్న విద్యా వాలంటీర్ 2023-24 విద్యా సంవత్సరము వేతనము ల కొరకు 60 వేల రూపాయలు మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ప్రతినిధులు జిఎం నాగేశ్వరరావు అడ్వైసర్ జగన్నాథరావు చేతులు మీదుగా గ్రామ సర్పంచ్ సునీత బాలరాజు, మరియు పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస కి చెక్కును అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఏజియం శ్రీనివాస్, రత్నం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## రిషితను సన్మానిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ పుట్టా రమేష్

**టీ మీడియా, సెప్టెంబర్ 6, నడిగూడెం :**
నీట్ ఎంట్రన్స్ లో ర్యాంకు సాధించి ఎంబిబిఎస్‌లో సీటు పొందిన అనంతుల రిషితను నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ పుట్టా రమేష్ బుధవారం తమ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని బందావనపురం గ్రామ మాజీ సర్పంచ్ అనంతుల ఆంజనేయులు కుమార్తె రిషిత మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని నీట్ ఎంట్రెన్స్ లో ర్యాంకు సాధించి మెడికల్ కౌన్సిలింగ్ లో ఆర్ వి యం సిద్దిపేట కళాశాలలో మెడికల్ సీటు సాధించడం పట్ల గ్రామస్తులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారని అన్నారు. డాక్టర్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకొని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంతుల ఆంజనేయులు, పుట్టా సీతయ్య, కార్యాలయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## యువత తప్పకుండా ఓటర్ గా నమోదు చేసుకోవాలి

- శ్రవణ్ కుమార్

**టి మీడియా, సెప్టెంబర్ 6, హుజూర్ నగర్ :**
భారతీయ ఎన్నికల సంఘం వారు నిర్వహించే నూతన ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం 11వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ... 20027వ బూత్ లో 18 సంవత్సరాలు నిండిన యువత కచ్చితంగా ఓటర్ నమోదు చేసుకోవాలని, అలాగే ఓటర్లు తప్పు, ఒప్పులు సరి చేసుకోవాలని, వార్డు ప్రజలకు అవగాహన కార్యక్రమం ద్వారా యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసి ఓటర్ నమోదు చేసుకోవాలని సూచన చేసారు. ఈ కార్యక్రమంలో భూత్ ఆఫీసర్ పులిచింతల ఉష, ఆర్ పి మంద రాధా, వార్డ్ ఆఫీసర్లు, వార్డు ప్రజలు, బూతు యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

**టి మీడియా, సెప్టెంబర్ 6, మేళ్ళ చెరువు :**
బుధవారం మేళ్లచెరువు మండలం వెంకట్రాంపురం గ్రామంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మేళ్లచెరువు ఎంపిపి కొట్టే పద్మ సైదేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనుకున్న సమయానికి ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల హదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే రీతిలో ముందుకు వస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మ గోవింద రెడ్డి ఎంపీటీసీ బండారుపల్లి రామకృష్ణ , స్థానిక సర్పంచ్ బేత కల్పన వీర నాగిరెడ్డి ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జీ20 సమ్మిట్‌కు ముందు పీఎం బిజీబిజీ..

## మూడురోజుల షెడ్యూల్ ఇదే..

**టీ మీడియా, సెప్టెంబర్ 6.న్యూఢిల్లీ :**

ఆసియాన్-భారత్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఈ సాయంత్రం ఇండోనేషియా వెళ్లనున్నారు. సెప్టెంబర్ 9-10 తేదీల్లో జరగనున్న జీ20 సదస్సుకు కేవలం 3 రోజుల ముందు ఆసియాన్-భారత్, తూర్పు ఆసియా శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 6, 7 తేదీల్లో ఇండోనేషియా రాజధాని జకార్తాలో పర్యటించనున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. మంత్రుల మండలి సమావేశంతో పాటు మధ్యాహ్నం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. జకార్తా పర్యటనకు ముందు రాత్రి 7:30 గంటల వరకు తిరిగి సమావేశాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత రాత్రి 8 గంటలకు పీఎం మోడీ జకార్తాకు బయలుదేరి, సెప్టెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు జకార్తా చేరుకుంటారు. గురువారం ఉదయం 7 గంటలకు మోడీ ఆసియాన్ ఇండియా శిఖరాగ్ర సదస్సు వేదికకు చేరుకుని, సమ్మిట్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత ఉదయం 8:45 గంటలకు ఆయన తూర్పు ఆసియా సదస్సులో పాల్గొంటారు. సమావేశం ముగిసిన తర్వాత పీఎం మోడీ ఉదయం 11:45 గంటలకు విమానాశ్రయానికి బయలుదేరుతారు. సాయంత్రం 6:45 గంటలకు ఢిల్లీ చేరుకుంటారు. సెప్టెంబరు 8న ప్రధానమంత్రి 3 దేశాలతో ముఖ్యమైన ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. ఇందులో అమెరికా అధ్యక్షుడు బిడెన్‌తో సమావేశం కూడా ఉంటుందని దేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.



### వాణిజ్యం, భద్రతలపై చర్చ..

ఈ పర్యటనలో నరేంద్ర మోడీ ఆసియాన్ సభ్య దేశాలతో అంటే ఆగ్నేయాసియా దేశాల సంఘంతో వాణిజ్యం, భద్రత వంటి ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నారు. ఏసీఎన్ దేశాలలో యూపీఐ ప్రారంభాన్ని సమ్మిట్ సమయంలో ప్రకటించే ఛాన్స్ ఉంది. ఆసియాన్‌లో మలేషియా, ఇండోనేషియా, మయన్మార్, వియత్నాం, కంబోడియా, ఫిలిప్పీన్స్, బ్రూనై, థాయిలాండ్, లావో స్, సింగపూర్ ఉన్నాయి. సెప్టెంబరు 5 నుంచి ప్రారంభమైన ఆసి యాన్ సదస్సు సెప్టెంబర్ 8 వరకు కొనసాగనుంది. సెప్టెంబర్ 6-7 తేదీల్లో జరిగే ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు.

### ఇండో-పసిఫిక్ ఫోరమ్‌లోనూ..

విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, 2022-23లో భారత్, ఆసియాన్ దేశాల మధ్య రూ. 10 లక్షల కోట్ల వ్యాపారం జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ గతంలో 9 ఆసియాన్ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈసారి ఆసియాన్ సదస్సు సందర్భంగా ఇండోనేషియా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి ఇండో పసిఫిక్ ఫోరమ్ అని పేరు పెట్టారు. ఈ ఫోరమ్ ద్వారా, ఆసియాన్ దేశాలు ఇండో-పసిఫిక్‌లో తమ లక్ష్యాల గురించి అభిప్రాయాన్ని తెలియజేస్తాయి. ఇందులో ఇండో-పసిఫిక్‌లో ఆసియాన్ దేశాల కనెక్టివిటీని పెంచడంపై చర్చలు జరగనున్నాయి. నిజానికి ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా జోక్యం పెరుగుతుండటంపై చాలా కాలంగా ఆందోళన వ్యక్తమవుతోంది. చైనాకు సంబంధించి ఏదైనా ప్రకటన విడుదల చేస్తారా అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను అడిగినప్పుడు, విదేశాంగ తూర్పు వ్యవహారాల కార్యదర్శి సౌరభ్ కుమార్ మాట్లాడుతూ అక్కడ ఏం చర్చిస్తారో ఇప్పుడే ఊహించడం కష్టం. అయితే, సామూహిక ఆందోళన సమస్యలపై చర్చ సాధ్యమేనంటూ బదులిచ్చారు. ఆసియాన్ దేశాలతో భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం (%జూూ%) గత ఏడాది మాత్రమే సంతకం చేసింది. దీంతో ప్రధాని మోదీ పర్యటన అత్యంత కీలకమైంది. నిజానికి, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు బలపడతాయి. దీని కింద, రక్షణ, ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలను పెంపొందించడానికి కలిసి పని చేయనున్నాయి. అదే సమయంలో ఈ ప్రాంతంలో చైనాను ఎదుర్కోవడానికి భారతదేశం ఆసియాన్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేస్తోంది.

## క్రికెట్ సంబంధాల్ని పునరుద్ధరించాలని పాక్ బోర్డు కోరింది

- బీసీసీఐ

**టీ మీడియా, సెప్టెంబర్ 6, న్యూఢిల్లీ :**



బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా.. రెండు రోజుల పాటు పాకిస్థాన్‌లో పర్యటించారు. ఆ ఇద్దరూ ఇవాళ వాఘా బోర్డర్ ద్వారా దేశంలోకి ప్రవేశించారు. పాక్‌లో పర్యటించడం అద్భుతంగా ఉందని బిన్నీ తెలిపారు. అమత్‌సర్‌లో బోర్డర్ దాటిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 1984లో పాక్‌లో టెస్టు మ్యాచ్ ఆడానని, అప్పుడు ఎలా తమకు ఆతిథ్యం లభించిందో, ఇప్పుడు కూడా అలాంటి ఆతిథ్యమే దక్కిందన్నారు. తమను రాజుల్లా చూసుకున్నారన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారులతో పాటు ఇతర పాక్ అధికారుల్ని కూడా కలిసినట్లు రోజర్ బిన్నీ వెల్లడించారు. తమ పర్యటన పట్ల పాక్ క్రికెట్ బోర్డు సంతోషం వ్యక్తం చేసిందన్నారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. రెండు రోజులు పాక్‌లో పర్యటించామని, ఆ పర్యటన బాగా సాగిందన్నారు. గవర్నర్ తమకు విందును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాక్ క్రికెట్ బోర్డు ఆతిథ్య బాగుందన్నారు. రెండు దేశాల మధ్య మళ్లీ క్రికెట్ సంబంధాలను పునరుద్ధరించాలని పాక్ క్రికెట్ బోర్డు కోరిందని, అయితే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని శుక్లా తెలిపారు. ప్రభుత్వం ఏం చెబితే తాము అదే చేస్తామని పాక్‌కు చెప్పినట్లు ఆయన వెల్లడించారు. తమ పర్యటన కేవలం క్రికెట్ కోసమే అని, దీంట్లో ఎటువంటి రాజకీయ ఎజెండా లేదన్నారు.

## ఓటర్ అవగాహన కార్యక్రమం

**టీ మీడియా, సెప్టెంబర్ 6, నడిగూడెం :**



నడిగూడెం మండలం వల్లాపురం గ్రామంలో ఓటరు అవగాహన కార్యక్రమం భాగంగా వల్లాపురం సంఘ బంధం 1.2 లో ఓటర్ నమోదు కార్యక్రమంలో మహిళా సంఘాలు రంగవల్లి కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిసి వివో ఏ అంగన్వాడీ టీచర్స్ ఫీల్డ్ అసిస్టెంట్, మహిళా సంఘ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

# నిరంతరం ప్రజల కోసం పని చేసే... చింతా ప్రభాకర్‌ను గెలిపించుకోవాలి

- మంత్రి హరీశ్ రావు

**టీ మీడియా, సెప్టెంబర్ 6, సంగారెడ్డి :**



సంగారెడ్డి నియోజక వర్గంలో తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజల మనిషి అని, తాను గత ఎన్నికల్లో ఓటమి చెందినా కూడా అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు అందబాటులో ఉన్న వక్తి చింతా ప్రభాకర్ అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం మాజీ (బీజేపీ) ఎంపీపీ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే చింతా ప్రభాకర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకుని గెలిపించాలని సూచించారు. తాను ఎల్లప్పుడు ప్రజల కోసమే ఆలోచించే మనిషని, దీన్ని దష్టిలో పెట్టుకుని సంగారెడ్డిలోని ప్రతి కార్యకర్త కసిగా పని చేసి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత సంగారెడ్డి నాయకులపై ఉందన్నారు. ఎలాంటి పనులు కావలన్నా చింతా ప్రభాకర్ పట్టు పట్టి ఆ పనులను చేసి ప్రజలకు అందిచిన నాయకుడ చింతా ప్రభాకర్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతి పాండురంగం, వైస్ ఎంపీపీ లక్ష్మీరాంచందర్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రుక్మొద్దీన్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్, మాజీ సర్పంచ్‌లు, మండల ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మల్లాగౌడ్, మోహన్‌గౌడ్, ఎంపీటీసీలు రాందాస్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ప్రభుదాస్, కుమార్, నగేష్, ప్రవీణ్, నాగయ్య, రవి, గురుకిరణ్ పాల్గొన్నారు.



## ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

- పరుగులు తీసిన ప్రయాణికులు

**వరుస రైలు టీ మీడియా, సెప్టెంబర్ 6మహబూబ్‌నగర్**

ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల పట్టాలు తప్పడం, రైళ్లలో పొగలురావడం వంటి ఘటనలతో కలవరానికి గురి చేస్తున్నాయి. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లాలో రైలులో పొగలు వచ్చాయి. వరుస రైలు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల పట్టాలు తప్పడం, రైళ్లలో పొగలురావడం వంటి ఘటనలతో కలవరానికి గురి చేస్తున్నాయి. తాజాగా మహబూబ్‌నగర్ జిల్లాలో రైలులో పొగలు వచ్చాయి. హైదరాబాద్ నుంచి హౌరా వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు రావడంతో రైలును నిలిపివేశారు. ఒక్కసారిగా రైలు నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు పరుగులు పెట్టారు. అయితే, బ్రేక్‌లైన్ పట్టేయడంతో పొగలు వచ్చినట్లుగా సిబ్బంది పేర్కొన్నారు. ఆ తర్వాత రైల్వే సిబ్బంది సంఘటనా చేరుకొని మరమ్మతులు చేశారు. దాదాపు అరగంట తర్వాత రైలు మళ్లీ బయలుదేరడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వ్యాను

- ఆరుగురు మృతి

**టీ మీడియా, సెప్టెంబర్ 6,చెన్నై :**

తమిళనాడులో బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. సేలం-ఈరోడ్ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడాది చిన్నారితో సహా ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈంగూర్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యులు వ్యాన్‌లో పెరుంతురై వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు పక్కన ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొట్టింది. డ్రైవర్ నిద్రలో ఉండటమే ఇందుకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు సెల్వరాజ్, మంజుల, ఆరుముగం, పళనిసామి, పాపతితో పాటు ఏడాది వయసున్న చిన్నారిగా గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ విఘ్నేష్, మరో ప్రయాణికురాలు ప్రియా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే పేర్ల మార్పు రగడ

- బీఎస్పీ అధినేత్రి మాయావతి

**టి మీడియా, సెప్టెంబర్ 6, న్యూఢిల్లీ :**




జీ20 విందుకు రాష్ట్రపతి భవన్ పంపిన అధికారిక ఆహ్వాన పత్రంలో 'భారత్' అనే పదాన్ని వాడటంతో నెలకొన్న వివాదంపై బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పందించారు. ఈ అంశంపై విపక్ష కూటమితో పాటు పాలక ఎన్డీయేపైనా ఆమె విమర్శలు గుప్పించారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలు తమ కూటమికి ఇండియా అని పేరు పెట్టడం ద్వారా రాజ్యాంగంలో మార్పులు చేసేలా కేంద్రంలోని పాలక ప్రభుత్వానికి అవకాశం ఇచ్చాయని మాయావతి బుధవారం మండిపడ్డారు. ఈ విషయంలో పాలక, విపక్షాల ప్రమేయంపై ప్రజలు కలత చెందుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశం పేరుతో ఏర్పాటైన పార్టీలు, కూటములు, రాజకీయ పార్టీలను నిషేధించేలా ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు సమోటోగా చొరవ చూపాలని కోరారు. ఇండియా, ఎన్డీయే రెండు కూటములకూ సమాన దూరం పాటించాలని తమ పార్టీ తీసుకున్న వైఖరి సరైనదేనని ఇప్పుడు రుజువైందని మాయావతి పేర్కొన్నారు. విపక్షాలు తమ కూటమికి ఇండియా అని పేరు పెట్టడం, కేంద్ర ప్రభుత్వం దేశం పేరును భారత్‌గా మార్చేందుకు రాజ్యాంగంలో మార్పులు చేపట్టేందుకు పూనుకోవడం కుట్రగా అభివర్ణించారు. ఇది పథకం ప్రకారం విపక్ష, పాలక పక్ష కుట్రని మాయావతి ఆరోపించారు. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల వంటి అంశాలను ఎన్నికల ముందు మరుగుపరిచి, ఎలాంటి అంశాలను విపక్ష, పాలక పక్షాలు ముందుకు తెస్తున్నాయో ప్రజలు అర్థం చేసుకుంటారని చెప్పారు. విపక్ష, పాలకపక్ష కూటముల రాజకీయాలు ప్రజా ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు వంటివని మాయవతి వ్యాఖ్యానించారు.

# బోసిపోతున్న శ్రీశైలం జలాశయం

## అడుగంటిన నీరు.. ఇన్ ఫ్లో జీరో

**టీ మీడియా, సెప్టెంబర్ 6,శ్రీశైలం :**

వర్షాలు పడుతున్నా సాగునీటి కరవు తీరే దారి కనబడటం లేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు ప్రధాన నీటి వనరుగా ఉన్న శ్రీశైలం రిజర్వాయర్‌కు ఒక్క చుక్క కూడా ఎగువ నుంచి వచ్చి చేరటం లేదు. బుధవారం సాయంత్రానికి శ్రీశైలం రిజర్వాయర్ ఇన్ ఫ్లో జీరోగా నమోదయిందంటే పరిస్థితి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 215.81 టీఎంసీల నీటి నిల్వ సామర్ధం కలిగిన శ్రీశైలం రిజర్వాయర్ లో ప్రస్తుతం 82.59 టీఎంసీలు.. 38.27 శాతం నీళ్ళు మాత్రమే ఉన్నాయి. ఉన్న కొద్దిపాటి నీళ్ళను కూడా విద్యుదుత్పత్తికి వినియోగంచటంతో శ్రీశైలం రిజర్వాయర్ బోసిపోతోంది. రిజర్వాయర్లలో చేరుకున్న నీటిని తాగునీటి అవసరాలకూ, ఆ తరువాత వ్యవసాయ అవసరాలకు వినియోగించాలని కృష్ణా బోర్డుతో పాటు కేంద్ర జలసంఘం పదే పదే చెబుతున్నా పట్టించుకుంటు-న్న దాఖలాలు కానరావటం లేదు. ఆగస్టు నెలలోని తొలి రెండు వారాలో శ్రీశైలం రిజర్వాయర్ నీటిని విద్యుదుత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం తోడేసింది. ఫలితంగా మూడో వారం నుంచి రిజర్వాయర్ కనిష్ట స్థాయికి అడుగంటింది. శ్రీశైలం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు ఆగస్టు రెండవ వారంలో 870 అడుగుల దాకా నీరుంటే ఇపుడు 851 అడుగులకు తగ్గిపోయింది.

ఎడమగట్టు పవర్ హౌస్ నుంచి విద్యుదుత్పత్తి నిలిపివేయాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం ఖాతరు చేయలేదు. తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ జెన్ కోకు కష్ణా బోర్డు లేఖ రాసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. నీటి అవసరాల కోసం తెలంగాణకు ఎలాంటి ఇండెంట్ ఇవ్వలేదని కృష్ణా బోర్డు చెప్పినా విద్యుదుత్పత్తి అంశం బోర్డు పరిధిలోనిది కాదని అక్కడి అధికారులు చెబుతున్నారు.



సాగర్‌కు నీటి విడుదల కోసం ఇండెంట్ ఇస్తేనే శ్రీశైలంలో విద్యుదుత్పత్తి చేయాల్సి ఉంటుందని కృష్ణా బోర్డు చెప్పటం నిబంధనలకు విరుద్ధమనీ, శ్రీశైలం నిండిన తరువాతే సాగర్‌కు నీటిని విడుదల చేయాలన్న వాదన సహేతుకం కాదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆగస్టు 11,12న కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 0.192 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 7.975 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసినట్టు రికార్డయింది. ఫలితంగా శ్రీశైలం నీటి నిల్వలన్నీ అడుగంటాయి..ఆ తరువాత వర్షాలు జాడ లేకపోవటంతో రిజర్వాయర్ బోసిపోతూ ఉంది.

### సాగర్ వెలవెల

శ్రీశైలం దిగువన నాగార్జున సాగర్ కూడా వెలవెలపోతోంది. గత ఏడాది ఇదే సమయానికి పరవళ్ళు తొక్కిన నాగార్జున సాగర్ ప్రస్తుతం గరిష్ట నీటి నిల్వ సామర్ధంలో 50 శాతానికి పరిమితమైంది. బుధవారం సాయంత్రానికి 312 టీఎంసీల గరిష్ట నిల్వ సామర్థ్యానికి గాను 156.67 టీఎంసీల నిల్వలున్నాయి. సాగర్ దిగువన ఉన్న పులిచింతల రిజర్వాయర్‌లోనూ సగం నిల్వలే ఉన్నాయి. 45.77 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గాను 22.05 టీఎంసీల నిల్వలున్నాయి. స్థానికంగా కృష్ణా పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో ప్రకాశం బ్యారేజి మాత్రం నిండుకుండలా కళకళ లాడుతోంది. 3.07 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్ధంతో ప్రకాశం బ్యారేజి జలకళ సంతరించుకుంది.



## మాయ మాటలు, మేకపోతు గాంభీర్యంతో ప్రజలను మోసం చేయవద్దు

- కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు

**టీ మీడియా, సెప్టెంబర్ 06, రామకృష్ణాపూర్**

బుధవారం చెన్నూరు నియోజకవర్గం లోని మందమర్రి పట్టణంలోని రెండవ వార్డులో ప్రజలు పెద్ద ఎత్తున చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే బాల్క సుమన్ స్థానికేతరుడని, 2014 ఎన్నికల ముందు తనకు ఓటు వేసి గెలిపిస్తే మందమర్రి పట్టణాన్ని మున్సిపాల్టి గా మార్చి, ఎన్నికలు నిర్వహించి అభివద్ధి చేస్తానని చెప్పిన బాల్క సుమన్ ఇచ్చిన హామీని మరిచి దోచుకోవడం... దాచుకోవడానికి అలవాటు పడ్డాడని డాక్టర్ రాజా రమేష్ బాబు ఆరోపించారు. చెన్నూరు నియోజకవర్గం సుమన్ కు టూరిస్ట్ ప్రదేశంగా మారిందని, నెలకు రెండు రోజులు రెండు బంగ్లాల్లో వుండి వెళ్తున్నారని విమర్శించారు. ఓటమిని ముందే గుర్తించిన సుమన్ ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లో పది మంది ని పోగు చేసి ఏకగ్రీవ తీర్మానాలు చేయడం జరుగుతుందని, అదే పని కాంగ్రెస్ చేయాలనుకుంటే వేల మంది తో ఏకగ్రీవ తీర్మానం చేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి వస్తేనే బతుకులు మారుతాయని భావించి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల అధ్యక్షులు కడారి జీవన్,యూత్ కాంగ్రెస్ నాయకులు హరీష్ పొన్నం, రాజుకుమార్, తిరుపతి, శేఖర్, మహిళలు రజిత, కవిత, రాజమ్మ, పొసక్క తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సదస్సును విజయవంతం చేయండి

- మండల అధ్యక్షులు బూత్కూరి వెంకటరెడ్డి

**టీ మీడియా, సెప్టెంబర్ 6, నడిగూడెం :**

ఈ నెల 9న కోదాడ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం నందు జరిగే నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షులు బూత్కూరి వెంకట్ రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం దగ్గర నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు..కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో కేసీఆర్ గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూన్నారని దుయ్యబట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంపదను పాలకులు దోచుకుంటున్నారని గత కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు స్థాపించి విద్య వైద్యం ప్రాజెక్టులు పరిశ్రమలు తాగునీరు సాగునీరు అందించి దేశాన్ని అగ్రభాగంలో నిలిపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మాయమాటలతో మళ్ళీ దళిత బంధు గిరిజన బంధు మైనార్టీ బందు అంటూ ఓట్ల కోసం వస్తున్న కెసిఆర్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ మైనారిటీ నాయకులు హైమద్ పల్లపు గోపాల్ తదితరులు ఉన్నారు.





## సాముల రామిరెడ్డికి ఘనంగా సన్మానం

- నాయీబ్రాహ్మణ సేవాసంఘం

**టి మీడియా, సెప్టెంబర్ 6, హుజూర్ నగర్ :**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హుజూర్ నగర్ నియోజకవర్గంలో అమరవరం మారుమూల గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల నందే విద్యాభ్యాసం చేసి, అంచలంచలుగా ఎదిగిన సహదయుడు, ప్రతిభావంతుడు, మానవతావాది, నమ్ముకున్న ప్రతివ్యక్తిని ఆదుకొనే ఆత్మబంధువు, స్నేహశీలి, ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి కి ప్రపంచ దేశాలలోనే ఎంతో ప్రసిద్ధిగాంచి ఆధ్యాత్మికంగా అత్యున్నతమైన స్థానం కలిగిన భారతదేశంలో నే తెలుగు రాష్ట్రాలలో కలియుగ దైవంగా పూజింపబడుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం నందు శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలిలో సభ్యుడిగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసి హుజూర్ నగర్ విచ్చేసిన సందర్భంగా హుజూర్ నగర్ పట్టణ నాయీబ్రాహ్మణ సేవాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో సుతారి శ్రీనివాసరావు గజమాల,శాలవాతో ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో హుజూర్ నగర్ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్ష కార్యదర్శులు దూదిపాళ్ళ సురేష్, కొంగర హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు సుంకరి ఉపేందర్, పిల్లుట్ల రవి, మర్రిపెల్లి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.